క్లుప్తంగా

చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అరెస్ట్ అక్రమం


బొద్దు వెంకటేశ్వరరావు

చింతలపూడి : చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని అక్రమంగా అరెస్టు చేశారని వైఎస్సార్ సీపీ మున్సిపల్ విభాగం జిల్లా అధ్యక్షుడు బొద్దు వెంకటేశ్వరరావు శుక్రవారం చింతలపూడిలో ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తోందన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులను లక్ష్యంగా చేసుకొని అక్రమ కేసులు పెట్టి వేధిస్తోందని దుయ్యబట్టారు. రాజకీయ కక్షతోనే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని, మాజీ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డిని అరెస్టు చేశారని వివరించారు. ప్రభుత్వం పట్ల ప్రజల్లో వస్తున్న వ్యతిరేకతను డైవర్ట్ చేయడానికి ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని తెలిపారు. ముఖ్యంగా కూటమి పాలనలో మహిళలకు భద్రత కరువైందన్నారు. వైఎస్సార్ సీపీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వస్తోన్న ప్రజాదరణను తట్టుకోలేక ఆయన పర్యటనలను కూడా అడ్డుకుంటున్నారని ఆరోపించారు. పోలీసు ఆంక్షలు విధించి ఒక పార్టీ అధ్యక్షుడిని పర్యటించకుండా అడ్డుకోవడం సరికాదని అన్నారు. ఇవన్నీ ప్రజలు గమనిస్తున్నారని, తగిన సమయంలో తగిన విధంగా బుద్ధి చెప్తారని కూటమి నాయకులను హెచ్చరించారు.

ఇద్దరిపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: వ్యక్తిని కొట్టి గాయపరిచిన నేరానికి ఇద్దరిపై కేసు నమోదు చేశామని హెచ్‌సీ టి.బాబూరావు తెలిపారు. కుటుంబ కలహాల నేపథ్యంలో జంగారెడ్డిగూడెం మండలం కేతవరం గ్రామానికి చెందిన భార్యాభర్తలు మల్లెల్లి మోహన్, రాటాలు నాలుగేళ్లుగా విడిగా ఉంటున్నారు. ఈ నెల 19న పెద్దల సమక్షంలో మాట్లాడుకునేందుకు జంగారెడ్డిగూడెం ఎంఆర్‌పీఎస్ కార్యాలయంలో సమావేశమయ్యారు. మోహన్ తరుపు పెద్దలు డోలా రామయ్య, మరికొందరు ఎంఆర్‌పీఎస్ కార్యాలయానికి వచ్చారు. అక్కడికి వచ్చిన రాటాలు, ఆమె వెంట వచ్చిన ఉండి రమేష్‌లు ఒక్కసారిగా రామయ్యపై దాడి చేశారు. దీంతో రామయ్యకు రక్త గాయాలయ్యాయి. అక్కడే ఉన్న వారు వీరిని అడ్డుకుని రామయ్యను స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు. రామయ్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ తెలిపారు.

శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి విరాళం

ద్వారకాతిరుమల: స్థానిక శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి భీమడోలు మండలం పూళ్లకు చెందిన పచ్చా శ్రీనివాసరావు శుక్రవారం రూ. 1,00,116 విరాళంగా అందజేశారు. ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమ చేశా రు. తొలుత ఆయన కుటుంబ సభ్యులతో కలిసి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. దాతకు ఆలయ సూపరింటెండెంట్ హయగ్రీవాచార్యులు విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

బ్రిడ్జిలపై భయం భయం

- ప్రమాదపుటంచున ప్రయాణం
- విరిగిపోతున్న రెయిలింగ్‌లు
- మరమ్మతులకు నోచుకోని వైనం
- ఏలూరులో ప్రజల ఆవేదన



నగరంలోని ప్రధాన ఓవర్ బ్రిడ్జిపై రెయిలింగ్ కూలిపోయిన ప్రాంతాలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నగరంలోని పలు బ్రిడ్జిలు, కాజ్‌వేల వద్ద రెయిలింగ్‌లు విరిగిపోయి ప్రమాదకరంగా మారాయి. దీంతో నగర ప్రజలు ప్రమాదపుటంచున ప్రయాణిస్తున్నారు. నగరంలో దాదాపు 60 సంవత్సరాల చరిత్ర గల ప్రధాన రైల్వే ఓవర్ బ్రిడ్జి ఒన్‌టౌన్, టూ టౌన్ ప్రాంతాలను అనుసంధానం చేస్తోంది. ఈ రెండు ప్రాంతాల ప్రజలు అటు నుంచి ఇటు, ఇటు నుంచి అటు వెళ్లడానికి, ఏలూరు నుంచి తాడేపల్లిగూడెం, రాజమండ్రి, ద్వారకాతిరుమల తదితర ప్రాంతాలకు వెళ్లడానికి, అటు నుంచి ఇటు రావడానికి ఆర్టీసీ బస్సులు కూడా దాదాపు అన్నీ ఈ ఓవర్‌బ్రిడ్జి మీదుగానే ప్రయాణిస్తుంటాయి. రైల్వే ఓవర్ బ్రిడ్జికి ఒక వైపు మూడు ప్రాంతాల్లో రెయిలింగ్ కూలిపోయి ఖాళీలు ఏర్పడ్డాయి. రెయిలింగ్ సిమెంట్ దిమ్మెలు బీటలు వారి విరిగిపోయిందుకు సిద్ధంగా ఉన్నాయి. అవి విరిగితే బ్రిడ్జి కింద ప్రయాణికులపై పడి ప్రాణ నష్టం కూడా సంభవించే ప్రమాదం ఉంది.

శంకుస్థాపనకే పరిమితం

ప్రధాన రైల్వే ఓవర్‌బ్రిడ్జి మాత్రమే కాక రెండు దశాబ్దాలు కూడా పూర్తికాని పాత బస్టాండు వద్ద ఉన్న మరో రైల్వే ఓవర్‌బ్రిడ్జి వద్ద కూడా కొంత ప్రమాదకరంగానే దర్శనమిస్తోంది. నగరం నుంచి శనివారపు పేట, దుగ్గిరాల వెళ్లే మార్గంలో అమీనాపేట వద్ద ఉన్న కాజ్ వేపై కూడా ఒకవైపు రెయిలింగ్ విరిగిపోయింది. ప్రతి వర్షాకాలంలో తమ్మిలేరు పొంగి ఈ కాజ్‌వే మీదుగా నీరు వెళుతూ రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది. వచ్చేది


తమ్మిలేరుపై శనివారపు పేట కాజ్ వే వద్ద రెయిలింగ్ కూలిపోవడంతో ఏర్పాటు చేసిన బారికేడ్లు ఒరిగిపోతున్న దృశ్యం

వర్షాకాలం కావడంతో ఈ సారి కూడా అటువంటి పరిస్థితిని ఎదుర్కోవాల్సి వస్తుందని ప్రజలు అందోళన చెందుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నెలల కాలంలోనే శనివారపు పేట కాజ్‌వే వద్ద బ్రిడ్జి నిర్మాణానికి ఎమ్మెల్యే బడేటి చంటి హడావుడిగా శంకుస్థాపన చేసేశారు. ఇంకేముంది ఒక్కడ బ్రిడ్జి ఏర్పడుతుంది. ఇకపై తమ కష్టాలు తీరుతాయని ప్రజలంతా సంతోషించారు. అయితే శంకుస్థాపన చేశారు గానీ బ్రిడ్జి నిర్మాణానికి ఒక్క ఇటుక కూడా పేర్చకపోవడంతో ఇది కూటమి ప్రభుత్వం ఆరంభశూరత్వానికి ఇది మరో ఉదాహరణగా మిగిలిపోతుందని ప్రజలు విమర్శిస్తున్నారు.

ప్రమాదాలు జరిగితే ఎవరు బాధ్యులు?

ప్రధాన ఓవర్ బ్రిడ్జికి మూడు ప్రాంతాల్లో రెయిలింగ్ విరిగిపోయి ఉండడంతో బ్రిడ్జిపై అనుకోని ప్రమాదం జరిగితే భారీ వాహనాలు సైతం అదుపుతప్పి కిందకి పడిపోయే ప్రమాదం ఉంది. అదే జరిగితే భారీ ప్రాణనష్టం తప్పదు. శనివారపు పేట కాజ్‌వే వద్ద కూడా వర్షాకాలంలో తమ్మిలేరు పొంగితే ఇప్పటికే కూలిన రెయిలింగ్ వరద వేగానికి దానికి ఆనుకుని ఉన్న మిగతా భాగం కూడా కొట్టుకుపోయే ప్రమాదం ఉందంటున్నారు. అలా జరిగితే ఇటువైపు రాకపోకలకు తీవ్ర ఆటంకం ఏర్పడుతుందంటున్నారు. ఇలాంటి ప్రమాదాలు జరిగితే ఇప్పటికే నిద్రావస్థలో ఉన్న ఆయా శాఖల్లో ఏ శాఖ బాధ్యత వహిస్తుందని, ఇటువంటి పరిస్థితికి ఎవరు జవాబుదారీగా ఉంటారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

మరమ్మతులు చేయించాలి



నగరంలో ఎక్కువ మంది ప్రజలు ప్రయాణించే ప్రధాన ఓవర్ బ్రిడ్జితో పాటు శనివారపు పేట కాజ్ వే వద్ద రెయిలింగ్‌లు కూలిపోయి ప్రమాదాలకు సంకేతాలిస్తున్నాయి. ప్రమాదమూ జరగకముందే యంత్రాంగం స్పందించాలి. ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలి, ఇప్పటికే కూలిపోయిన రెయిలింగ్ కానాలను యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేస్తే ప్రమాదాలను నివారించాలి.

– గొంతిన రామకృష్ణ, సామాజిక కార్యకర్త

బ్రిడ్జి పనులు ప్రారంభించాలి



వర్షాకాలం వస్తోందంటే శ్రీరామ్ నగర్, న్యూ అశోక్ నగర్, దొండపాడు, శనివారపు పేట, దుగ్గిరాల ప్రాంతాల ప్రజలు నగరంలోకి ప్రవేశించడానికి అమీనాపేట వద్ద ఉన్న శనివారపు పేట కాజ్ వే ఒక్కటే ప్రధాన రహదారి. వర్షాకాలంలో తమ్మిలేరు పొంగి కాజ్ వే మీదుగా నీరు ప్రవహించి రాకపోకలు నిలిచిపోతాయి. బ్రిడ్జి నిర్మాణానికి బడ్జెట్ వచ్చిందంటున్నారు. వెంటనే పనులు చేపట్టాలి.

– వై.రాజేష్ కుమార్, శ్రీరామ్ నగర్ స్థానికుడు

ట్రాన్స్‌పోర్టు కూలి రేట్లు పెంచాలి


ప్రదర్శన చేస్తున్న నాయకులు, కార్యకర్తలు

ఏలూరు (టూటౌన్): ఏలూరు నగరంలో పచారీ షాపుల్లో పనిచేస్తున్న ఐఎఫ్‌టీయూ, ఏఐటీయూసీ సంఘాల కార్మికులు లోడింగ్ అన్లోడింగ్ ట్రాన్స్పోర్ట్ కూలి రేట్లు పెంచాలని కోరుతూ శుక్రవారం ప్రదర్శన, ధర్నా చేశారు. వైఎంహెచ్ఏ హాల్ సెంటర్ నుంచి ర్యాలీగా బయలుదేరి ఎస్ఎస్ హోల్‌సేల్ మార్కెట్ మీదుగా బిర్లా భవన్ సెంటర్ నుంచి మర్చంట్ చాంబర్ నాయకులు బాలకృష్ణ షాపు వద్ద, బుర్రంశెట్టి బ్రహ్మయ్య షాపు వద్ద, చాంబర్ అసోసియేషన్ అధ్యక్షుడు నేరెళ్ల రాజేంద్ర బాబు షాపు వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ అనుబంధ జట్టు కార్మిక సంఘం కార్యదర్శి గడసాల రాంబాబు మాట్లాడుతూ 50 ఏళ్ల నుంచి సాంప్రదాయంగా వస్తోన్న రెండేళ్లకోసరా కూలి రేట్ల ఒప్పంద పెంపుదల కాలపరిమితి ఏప్రిల్ 9వ తేదీతో ముగిసినా యజమానుల నుంచి స్పందన లేకపోవడం సరైనది కాదని చెప్పారు. తక్షణం చర్చలు నిర్వహించి, కూలి రేట్లు పెంచాలని యజమానులను కోరారు. ఏఐటీయూసీ అనుబంధ లాగుడు తోపుడు బండ్ల సంఘం ప్రెసిడెంట్ పుప్పాల కన్నబాబు మాట్లాడుతూ హమాలీల కులి రేట్ల పెంపదల విషయంలో జాప్యం తగదన్నారు. ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు, ఐఎఫ్‌టీయూ ఏలూరు నగర ప్రధాన కార్యదర్శి యర్రా శ్రీనివాసరావు, ఏఐటీయూసీ ఏలూరు కార్యదర్శి ఎ.అప్పలరాజు, సంఘీభావంగా ఇఫ్టూ జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు, ఏఐటీయూసీ ఏలూరు నగర అధ్యక్షుడు కె.కృష్ణమాచార్యులు మాట్లాడారు. పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రెవెన్యూ రిటైర్డ్ ఉద్యోగులకు సన్మానం


ఏలూరు(మెట్రో): రిటైర్డ్ రెవెన్యూ ఉద్యోగులను సత్కరిస్తున్న దృశ్యం

ఏలూరు(మెట్రో): ఏలూరు రెవెన్యూ భవనంలో శుక్రవారం రెవెన్యూ డేను ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కె.రమేష్‌కుమార్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. రెవెన్యూ శాఖ గొప్పతనాన్ని తెలిపేలా, ఉద్యోగుల్లో ఉత్సాహాన్ని నింపేలా రెవెన్యూ వేడుక విజయవంతానికి సహకరించిన రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ సభ్యులకు రమేష్‌కుమార్ అభినందనలు తెలిపారు. ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ సెక్రటరీ ఎ.ప్రమోద్‌కుమార్ మాట్లాడుతూ ప్రజలకు సమర్థవంతమైన సేవలు అందించేందుకు పునరంకితం కావాలన్నారు. ఈ సందర్భంగా రిటైర్డ్ రెవెన్యూ ఉద్యోగులు మెట్టు మోహన్‌రావు, జగన్ మోహన్ రావు, గణేశ్వర రావు, చంద్ర శేఖర్, జీవీ సుబ్బారావు, రాజశేఖర్, రామకృష్ణ, బెన్నీ, ఆదిల్, అమెన్సిల, సుబ్బా రావులను సత్కరించారు. కార్యక్రమంలో రవిచంద్ర రావు, జిల్లా వైస్ ప్రెసిడెంట్, కృష్ణ స్వామి ఏలూరు డివిజన్ ప్రెసిడెంట్, మాధవి జిల్లా జాయింట్ సెక్రటరీ, నాయక్, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ, గాయత్రి, ఏలూరు తహసిల్దార్, మరియు రెవిన్యూ ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు పాల్గొన్నారు.


దెందులూరు : సీనియర్ సిటిజన్లను సన్మానిస్తున్న రెవెన్యూ సిబ్బంది

సీనియర్లకు సన్మానం

దెందులూరు: ఏలూరు తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం రెవెన్యూ డే వేడుక నిర్వహించారు. సీనియర్ సిటిజన్లను తహసీల్దార్ జి.విజయకుమార్ రాజు, డిప్యూటీ తహసీల్దార్ నాగమణి, ప్రియదర్శిని, ఆర్ఐ అజయ్ సన్మానించారు. వీఆర్ఓ, వీఆర్ఏలు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ వెట్రిసెల్వికి కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

యోగా భారతావనికి లభించిన గొప్ప ప్రక్రియ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): యోగా భారతప్రజలకు లభించిన అద్భుత ప్రక్రియ అని ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబికా రాజా అన్నారు. ఆలపాటి రామచంద్రరావు శత జయంతి ఉత్సవాల్లో భాగంగా యోగాదినోత్సవాన్ని పురస్కరించుకుని అంతర్జాతీయ యోగా గురువు, తెలుగు బుక్ ఆఫ్ యోగా రికార్డ్స్ గ్రహీత వేముల ధర్మారావును శుక్రవారం స్థానిక అంబికా హౌస్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఘనంగా సత్కరించారు. కొద్ది సమయాన్ని యోగాకు కేటాయిస్తే ఆరోగ్యవంతులుగా తయారుకావచ్చని ధర్మారావు సూచించారు. సత్యవాడ దుర్గాప్రసాద్, పైడేటి రఘు, న్యాయవాది సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

కార్మిక, ఉద్యోగ వ్యతిరేక విధానాలను విడనాడాలి

చింతలపూడి : కూటమి ప్రభుత్వం కార్మికులు, ఉద్యోగుల వ్యతిరేక విధానాలను విడనాడాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్‌వీఎస్ నారాయణ డిమాండ్ చేశారు. ఇటీవల కూటమి ప్రభుత్వం కార్మికులు ఉద్యోగుల పని గంటల పెంపు, మహిళా ఉద్యోగ కార్మికులు రాత్రి సమయాల్లో పనిచేసే విధానాన్ని అమలుచేస్తూ నిర్ణయించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం ధర్నా చేశారు. తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఎన్నో పోరాటాల ఫలితంగా సాధించుకున్న ఎనిమిది గంటల పని విధానాన్ని, మహిళల భద్రత చట్టాలను పక్కనపెట్టి పెట్టుబడిదారులకు, పారిశ్రామికవేత్తలకు లాభం చేకూర్చే విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టడాన్ని నిరసిస్తూ స్థానిక ఫైర్ స్టేషన్ సెంటర్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఎస్ సరోజిని, టి.మాణిక్యం, జి.సరళ దేవి, కె.కవిత, ఎం అరుణ కుమారి, వై.సీతామహాలక్ష్మి పాల్గొన్నారు.

కూటమి వైఫల్యాలను ఎండగడదాం

వైఎస్సార్ సీపీ సమన్వయకర్త జయప్రకాష్


జయప్రకాష్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న ప్రత్తిపాటి విక్టర్ బాబు


జయప్రకాష్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న రంగబాబు, ఈసీ మెంబర్ బత్తుల సతీష్

ఏలూరు టౌన్: టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి ప్రభుత్వం ఎన్నిక హామీలను అమలు చేయకుండా మోసం చేస్తోంది, రాబోయే కాలంలో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని వైఎస్సార్ సీపీ ఏలూరు సమన్వయకర్త మామిళ్లపల్లి జయప్రకాష్ అన్నారు. పార్టీ పదవులు పొందిన నాయకులు పార్టీ ఏలూరు కార్యాలయంలో జయప్రకాష్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. పార్టీ జిల్లా అధ్యక్షులు దూలం నాగేశ్వరరావు, పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల సమస్యలపై పోరాటం చేస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జయప్రకాష్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సూపర్ 6 హామీలు అమలు చేయలేక చేతులెత్తేసిందన్నారు. తల్లికి వందనం పథకాన్ని ఒక ఏడాది ఇవ్వకుండా, రెండో ఏడాది కొందరికే డబ్బులు వేసిందని ఆరోపించారు. ఏలూరు నగరంలోనూ అనేక మంది తల్లులకు తల్లికి వందనం డబ్బులు పడలేదన్నారు. కొత్త ఉద్యోగాలను భర్తీ చేయకుండా నిరుద్యోగ యువతకు అన్యాయం చేసిందని తెలిపారు. వైఎస్సార్ సీపీ హయాంలో ఉద్యోగ కల్పన జరిగితే నేడు ఉన్న ఉద్యోగాలను తొలగించే పనిలో కూటమి ప్రభుత్వం ఉందని ఆరోపించారు. జయప్రకాష్‌ను కలిసిన వారిలో పార్టీ ఏలూరు నగర ఈసీ మెంబర్ ప్రత్తిపాటి విక్టర్‌బాబు, నగర ప్రధాన కార్యదర్శి కొప్పుల రంగబాబు, నగర ఈసీ మెంబర్ బత్తుల సతీష్, సాగు శ్రీను ఉన్నారు. కార్యక్రమాల్లో నగర కార్పొరేటర్ తుమరాడ స్రవంతి, లీగల్ సెల్ అధ్యక్షుడు ప్రత్తిపాటి తంబి, పొలిమెట్ల వినయ్, యల్లపు రణదీర్, షేక్ షమ్మీ, గుడిపూడి అఖిలేష్, తేజ్, ఖాజా, సత్యనారాయణ, రవి, సీనియర్ నాయకులు చింతాడ నరేంద్ర, నాగు తదితరులు ఉన్నారు.

నేడు యోగాంధ్రకు సర్వం సిద్ధం


సీఆర్‌రెడ్డి కళాశాలలో ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ వెట్రిసెల్వి


ర్యాలీ నిర్వహిస్తున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు, సిబ్బంది

ఏలూరు (ఆర్ఆర్‌పేట): అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా స్థానిక సర్ సీఆర్ రెడ్డి డిగ్రీ కళాశాల గ్రౌండ్‌లో ఈనెల 21వ తేదీన నిర్వహించే యోగాంధ్ర జిల్లాస్థాయి కార్యక్రమ ఏర్పాట్లను కలెక్టర్ కె.వెట్రిసెల్వి శుక్రవారం సాయంత్రం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కళాశాలలో శనివారం ఉదయం 6.30 నుంచి 8.00 గంటల వరకు 5 వేల మందితో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఏలూరు నగరంలోని ఇండోర్ స్టేడియం, అల్లూరి సీతారామరాజు స్టేడియంలో కూడా యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. 6 నిమిషాలపాటు శరీరంలోని వివిధ విభాగాల కదలిక అభ్యాసనాలు, మరో 25 నిమిషాల పాటు వివిధ యోగాసనాలు, అనంతరం స్టాండింగ్ ఆసనాలు ఉంటాయని తెలిపారు. ప్రాణామాయం, కపాలబాతి, తదితర ఆసనాలు కూడా నిర్వహిస్తారని చెప్పారు. సుమారు 9 లక్షల మందితో జిల్లా వ్యాప్తంగా వార్డు, సచివాలయాల పరిధిలో శనివారం ఉదయం యోగా ప్రదర్శనలు నిర్వహించేందుకు ప్రభుత్వ యంత్రాంగం అన్నిఏర్పాటు పూర్తిచేసిందని తెలిపారు. కలెక్టర్ వెంట ఆర్‌డీఓ అచ్యుత అంబరీష్, మున్సిపల్ కమిషనరు ఎ.భానుప్రతాప్, డీఈఓ వెంకటలక్ష్మమ్మ తదితరులు ఉన్నారు.

యోగాంధ్ర ర్యాలీ

కోటదిబ్బ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో శుక్రవారం యోగా ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని ప్రిన్సిపాల్ జి.గిరిబాబు ప్రారంభించారు. కళాశాల ప్రాంగణం నుంచి కల్యాణ మండపం చౌరస్తా వరకు యోగా ప్రాముఖ్యతను తెలియజేసే నినాదాలతో ర్యాలీ చేశారు. వైస్ ప్రిన్సిపాల్ కె.అజయ్ కుమార్, యోగా దినోత్సవ కళాశాల ఇన్‌చార్జి టీవీ దుర్గాప్రసాద్, కళాశాల ఎన్ఎస్ఎస్ పీఓ ఎం విజయ్ కుమార్, అధ్యాపకులు వి.వెంకటరావు, ఎం రాంబాబు, టీవీఎస్ పద్మావతి, ఎం కృష్ణ చైతన్య, పీఆర్ కావ్యశ్రీ, ఎస్ సుశ్యలత, డి.సుజాత, అధ్యాపకేతర సిబ్బంది కె.శ్రీనివాసరావు, టి.అన్నాదొరై పాల్గొన్నారు.

అధికారులపై 'మట్టి ముఠా' ఒత్తిళ్లు


జలవనరుల శాఖ సబ్ డివిజన్ కార్యాలయం

కొయ్యలగూడెం: నైరుతి ప్రవేశించి పక్షం రోజులు గడుస్తున్నా వరుణదేవుడు చిరుజల్లులతో సరిపెడుతుండడంతో వర్షాల కోసం ఎదురుచూడడం అన్నదాతలకు పరిపాటి. అయితే అధికారులు వానల కోసం కరుణించవా వరుణదేవా అంటూ ఎదురు చూస్తుండడం గమనార్హం. నాలుగు నియోజకవర్గాల పరిధిలోని సేవలకు విస్తరించి ఉన్న జలవనరుల శాఖ కొయ్యలగూడెం సబ్ డివిజన్ కార్యాలయంలోని అధికారులు, సిబ్బంది వరుణ జపం ప్రారంభించారు. ప్రజలు లేదా రైతాంగం కోసం కాదు.. చెరువుల్లో సమృద్ధిగా నీరు వస్తేనే మట్టి అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడుతుందనేది వారి ఆకాంక్ష. ఇరిగేషన్ శాఖ (పీడబ్ల్యూడి) పరిధిలోని ఉన్న దాదాపు 150కి పైగా చెరువుల్లో సగానికి పైగా చెరువుల నుంచి గత నెలన్నర రోజులుగా యథేచ్ఛగా మట్టి అక్రమ రవాణా దందా నడుస్తోంది. ఇదంతా రాజకీయ, ప్రజాప్రతినిధుల కను సన్నల్లోనే కొనసాగుతుండడంతో ఇరిగేషన్ శాఖ అధికారులు అచేతనంగా మారారు. ఈనెల 19వ తేదీ రాత్రి భారీ స్థాయిలో మెట్ట ప్రాంతంలోని పలు చెరువుల నుంచి మట్టి అక్రమ రవాణాకు దళారులు సిద్ధమయ్యారు. లోకల్‌గా ఉన్న టిప్పర్లు, క్రషర్ ప్రాంతాల టిప్పర్లను వారం రోజులపాటు లీజుకు తీసుకున్నారు. విషయం జిల్లాలోని ఉన్నతాధికారులకు చేరడంతో విజిలెన్స్ దాడులు చేసే ప్రమాదం ఉందని అక్రమ రవాణాను అక్రమార్కులు తాత్కాలికంగా వాయిదా వేశారు. అయితే ఇప్పటికే టిప్పర్లకు అడ్వాన్సులను చెల్లించామని, కమర్షియల్ అవసరాలకు మట్టి రవాణా చేయకపోతే లక్షల్లో నష్టపోతామని రాజకీయ పెద్దలను ఆశ్రయించినట్లు తెలిసింది. దీంతో మట్టి రవాణా నిరోధకానికి సంబంధించి ముడిపడి ఉన్న వివిధ ప్రభుత్వ శాఖల అధికారులపై తీవ్రమైన ఒత్తిడి కొనసాగుతోందని సమాచారం. ఉన్నతాధికారులకు, ప్రజాప్రతినిధులకు మధ్య పోక చెక్కలా నలిగిపోతున్నామని స్థానిక అధికారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈనేపథ్యంలో తమను రక్షించగలిగేది వానదేవుడే అంటూ ఆకాశం వైపు ఆత్రుతగా ఎదురు చూస్తున్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	26	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	20	చిక్కుడు కాయలు	64
వంకాయలు (కాంతులు)	24	బీళ్లచిక్కుడు	--
వంకాయలు (తెలుపు)	34	చామదుంపలు	40
బెండకాయలు	30	ములక్కాడలు	08, 10
పచ్చిమిర్చి	34	కంద	--
కాకర కాయలు	48	బీట్‌రూట్	40
బీరకాయలు	30	కీరా దోస	40
బీరకాయలు (పందిరి)	44	ఫ్రెంచ్‌బీన్స్	86
క్యాబేజీ	24	అల్లం	60
క్యారెట్	40	కొత్తిమీర (కట్ట)	20
దొండకాయలు	20	పాలకూర	12
బంగాళదుంపలు	30	తోటకూర	10
ఉల్లిపాయలు	28	చుక్కకూర	12
గోరుచిక్కుడు	40	గోంగూర	07-10
దోసకాయలు	20	పుదీనా	05
ఆనబకాయ (1)	10-15	క్యాప్సికమ్	80
పొట్లకాయ(1)	20	చిలకదదుంప	40

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	25
ఏలూరు - జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర)	21.30	29
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	31
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	20
ఏలూరు - అమరావతి (ఇంద్ర)	19.00	రద్దు

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	25
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.15	4822	29
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	24
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	10.45	4798	26
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	21.15	4802	26
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	27
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	27
ఏలూరు - తిరుపతి	16.00	4830	34

IN THE COURT OF THE PRINCIPAL CIVIL JUDGE (SENIOR DIVISION) :: TENALI

HMOP No : 245/2024

Between:
Bandlamudi Sai Ravi Kumar @ Jaya Venkata Anantha Sai Ravi Kumar ...Petitioner
and
Bandlamudi Vimala @ Kunapalli Vimala ...Respondent

To
Bandlamudi Vimala @ Kunapalli Vimala W/o Bandlamudi Sai Ravi Kumar @ Jaya Venkata Anantha Sai Ravi Kumar R/o Padamata Street, Vardnapeta, Eluru, Eluru City

పై నెంబరు పిటిషన్ HMOP 245/ 2024 లో మీకు అనేక పర్యాయములు కోర్టు ద్వారా, పోస్టల్ ద్వారా నోటీసులు పంపినను తీసుకొనక Avoid చేసియున్నందున, శ్రీకోర్టువారు పేపరు ప్రచురణ ద్వారా మీ నోటీసుకై వాయిదా: 30-06-2025కు వాయిదా వేసినారు. సదరు తేది ఉదయం 10:30 గం॥లకు పై కోర్టులో మీరుగాని, మీ తరపు ప్లీడరు గారి ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనగలరు. లేనిచో మీ పరోక్షమున పిటీషను తీర్మానించబడును.
వాయిదా: 30-06-2025
ప్రదేశం: తెనాలి.

O/o Peta Pitchiah (Advocate)
Sri Shaik Firoj Basha
Kum. Peta Prathyusha
Advocate for Petitioners, Tenali.
cell: 92930 52501